మహిళలు .. ఇక వ్యాపారవేత్తలు

పొదుపు సంఘాల ఆధ్వర్యంలో నడుస్తున్న మహిళా మార్ట్ ప్రజలకు సౌకర్యంగా నిలుస్తోంది. నాణ్యమైన సరుకులు, మార్కెట్ ధర కంటే తక్కువ డిస్కౌంట్‌లతో సరుకులు లభిస్తుండడంతో మహిళ మార్ట్ లాభాలతో దూసుకుపోతోంది. రోజుకు సగటున రూ.40 వేల వ్యాపారం జరుగుతోంది. మహిళ మార్ట్ ప్రారంభమై ఆరు నెలల్లో దాదాపు రూ.కోటికి పైగా టర్నవర్ జరిగింది. ఇది మహిళల ఐక్యతకు నిదర్శనంగా నిలుస్తోంది. ఇతర పోటీ వ్యాపారాన్ని తట్టుకొని మహిళా మార్ట్ లాభాల్లో దూసుకుపోతుంది.

– కోడుమూరు

- మార్ట్‌ను విజయవంతంగా నడిపిస్తున్న మహిళలు
- ప్రజలకు సౌకర్యంగా అందుబాటులో ధరలు
- పొదుపు సంఘాలకు లాభం..ప్రజలకు సౌకర్యం


మార్ట్‌లో సరుకులను పరిశీలిస్తున్న అధికారులు

మహిళ చేయూత మార్ట్‌లో అమ్మకాలు వివరాలు

నెల	అమ్మకాలు
అక్టోబర్-2022	రూ.6,71,278
నవంబర్-2022	రూ.8,45,085
డిసెంబర్-2022	రూ.15,98,386
జనవరి-2023	రూ.17,72,051
ఫిబ్రవరి-2023	రూ.9,72,777
మార్చి-2023	రూ.11,55,953
ఏప్రిల్-2023	రూ.14,03,200
మే-2023	రూ.14,25,378

కోడుమూరులో ప్రయోగాత్మకంగా ఏర్పాటు చేసిన మహిళా మార్ట్ లాభాల్లో నడుస్తుండడంతో ఇతర ప్రాంతాల్లో మహిళా మార్ట్ ఏర్పాటు చేయాలని అధికారులు భావిస్తున్నారు. పొదుపు సంఘాల్లో ఉన్న ప్రతి మహిళ రూ.200 షేర్ ధనంతో కోడుమూరు మండలంలోని పొదుపు సంఘాల్లో ఉన్న మహిళలతో కలిసి రూ.28 లక్షలు పోగు చేసుకుని మహిళ మార్ట్‌ను ఏర్పాటు చేసుకున్నారు. పొదుపు సంఘాల్లో ఉన్న మహిళలు తమ ఇంటికి అవసరమైన సరుకులను ఇక్కడే కొనుగోలు చేసుకుంటున్నారు. దీనికి తోడు మిగతా ప్రజలు కూడా మహిళా మార్ట్‌లో సరుకులు కొనుగోలు చేస్తుండడంతో మహిళా మార్ట్ విజయవంతంగా నడుస్తోంది. నవంబర్ నెలలో కోడుమూరు పట్టణంలోని శ్రీ రామచంద్ర టాకీస్ వెనుక ఏర్పాటు చేసిన మహిళా మార్ట్ లాభాలతో దూసుకుపోతోంది. తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో ఏర్పాటు చేసిన చంద్రన్న మాల్ కేవలం టీడీపీ కార్యకర్తల ప్రయోజనాల కోసం నడవడంతో సదరు మాల్ మూడు నెలల్లోనే ఎత్తిపోయింది. ప్రభుత్వ సహకారం, అధికారుల పర్యవేక్షణతో డ్వాక్రా సంఘాల్లోని మహిళల ఐక్యతతో మహిళా మార్ట్ లాభాల్లో నడుస్తోంది. మార్కెట్‌లో లభించే ధరల కంటే తక్కువ ధరలకు, నాణ్యమైన సరుకులను వినియోగదారులకు అందించేలా సిబ్బంది కృషి చేస్తున్నారు. మహిళా మార్ట్‌లో జరిగే వ్యాపారాల వల్ల వచ్చే లాభాలు పెట్టుబడి పెట్టిన ప్రతి మహిళకు ఆదాయం వర్తిస్తుందని ప్రభుత్వం ఆదేశించడంతో పొదుపు సంఘాల్లో ఉన్న మహిళలు మార్ట్‌ను లాభాల్లో నడిచే విధంగా కాపాడుకుంటున్నారు.

నాణ్యమైన వస్తువులు ఇస్తున్నాం



మహిళా మార్ట్‌లో ఇతర పోటీ వ్యాపారాలను తట్టుకునేందుకు నాణ్యమైన సరుకులను అందజేస్తున్నాం. మార్కెట్ ధర కంటే తక్కువకే డిస్కౌంట్‌తో సరుకులను అందజేస్తున్నాం. నాణ్యమైన సరుకులు తక్కువ ధరలకు వస్తున్నందుకు ప్రజలనుంచి కోడుమూరు మహిళ మార్ట్‌కు మంచి ఆదరణ లభిస్తోంది.

– మాధవి, ఎంఎంఎస్ అధ్యక్షురాలు

సరుకుల నాణ్యత బాగుంది



కోడుమూరు మహిళా మార్ట్‌లో సరుకుల నాణ్యత బాగుంది. ఇతర కిరాణ షాపుల్లో ధరల కంటే ఇక్కడ దొరికే సరుకుల ధరలు తక్కువుగా వున్నాయి. మా ఇంటికీ అవసరమయ్యే సరుకులన్నీ ఇక్కడే కొనుగోలు చేస్తున్నా.

– భారతి, వినియోగదారులు

మార్ట్ లాభాల్లో నడుస్తోంది



పొదుపు సంఘాల్లోని మహిళల షేర్ ధనంతో ఏర్పాటు చేసిన మహిళా మార్ట్ లాభాల్లో నడుస్తోంది. అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షణతో సలహాలు, సూచనలు ఇవ్వడం వలన మహిళా మార్ట్ ఏర్పాటులో మంచి ఫలితాలు వచ్చాయి. రోజుకు రూ.40 వేలకు పైగానే వ్యాపారం నడుస్తోంది.

– పుష్పావతి, ఏపీఎం



ఐదో ఏడాది వైఎస్ఆర్ రైతు భరోసా కార్యక్రమాన్ని ప్రారంభించేందుకు గురువారం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పత్తికొండకు వచ్చారు. ఈ సందర్భంగా ఓర్వకల్లు విమానాశ్రయంలో ఆయనకు కోడుమూరు, పాణ్యం ఎమ్మెల్యేలు డాక్టర్ సుధాకర్, కాటసాని రాంభూపాల్‌రెడ్డి పూల బొకేలు ఇచ్చి స్వాగతం పలికారు.

ప్రజల మద్దతు మళ్లీ వైఎస్సార్‌సీపీకే

- కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ జరదొడ్డి సుధాకర్


బాలాజీనగర్‌లో లబ్ధిదారురాలికి సంక్షేమ క్యాలెండర్‌ను అందజేస్తున్న కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్

కర్నూలు (న్యూటౌన్): ప్రజల మద్దతు మళ్లీ వైఎస్సార్‌సీపీకేనని కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ జరదొడ్డి సుధాకర్ అన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఆయన గురువారం 39వ వార్డు పరిధిలోని బాలాజీనగర్‌లో పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి ఆప్యాయంగా పలకరించారు. ప్రభుత్వ పథకాల అమలు తీరును ప్రజలను అడిగి తెలుసుకున్నారు. ఆయా కుటుంబాలకు ప్రభుత్వం నుంచి చేకూరిన లబ్ధిని వివరించి సంక్షేమ క్యాలెండర్‌ను అందజేశారు. అనంతరం వైఎస్సార్ పింఛన్ కానుకను వృద్ధులు, వికలాంగులు, వితంతువులకు అందజేశారు. ఇంకా ఏమైనా సమస్యలుంటే తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. ప్రజాసంకల్ప పాద యాత్రలో ఇచ్చిన హామీలను 98 శాతానికిపైగా నెరవేర్చిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిదేనని ఎమ్మెల్యే కొనియాడారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో పేద, బడుగు, బలహీన వర్గాల ఆర్థిక స్థితిగతులు, జీవన ప్రమాణాలు మెరుగుపడ్డాయన్నారు. ఒక్కో ఇంటికి రూ.లక్ష నుంచి రూ.6 లక్షల దాకా లబ్ధి చేకూరిందన్నారు. కుల, మత, రాజకీయాలకు అతీతంగా సంక్షేమ ఫలాలు అందిస్తున్న జగనన్నకు అండగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో కార్పొరేటర్ సాంబ, సచివాలయ కన్వీనర్లు కరీం, ముజమ్మిల్, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

నేడు నందనపల్లెలో..

కర్నూలు మండలం నందనపల్లె గ్రామంలో శుక్రవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ భాస్కర్ నాయుడు గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కార్యక్రమానికి కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ జరదొడ్డి సుధాకర్ హాజరవుతారన్నారు. మండల పరిధిలోని అన్ని శాఖల అధికారులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు తప్పకుండా హాజరు కావాలని కోరారు.


బాలాజీనగర్‌లో వికలాంగుడికి వైఎస్సార్ పింఛన్ కానుకను అందజేస్తున్న కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్

చౌక్‌బాల్ క్రీడలో రాణించాలి


క్రీడాకారులను అభినందిస్తున్న చీఫ్ కోచ్ నటరాజన్

కర్నూలు(రూరల్): చౌక్‌బాల్ క్రీడలో రాణించాలని జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ చీఫ్ కోచ్ నటరాజ్ తెలిపారు. గురువారం నగరంలోని అవుట్ డోర్ స్టేడియంలో చౌక్‌బాల్ వేసవి శిక్షణ శిబిరం ముగింపు కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ క్రీడలు శారీరక, మానసిక ఉల్లాసాన్ని కలిగిస్తాయన్నారు. విద్య, ఉద్యోగ రంగాల్లో క్రీడా కోటా ద్వారా అపార అవకాశాలున్నాయన్నారు. ప్రతి ఒక్కరూ ఏదో ఒక క్రీడలో రాణించాలన్నారు. కార్యక్రమంలో చౌక్‌బాల్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి వేణుగోపాల్ పాల్గొన్నారు.

గ్రూపు–1 మెయిన్స్‌ను పకడ్బందీగా నిర్వహించండి


మాట్లాడుతున్న అనురాధ

కర్నూలు(సెంట్రల్): ఈనెల 3 నుంచి ప్రారంభమయ్యే గ్రూపు–1 మెయిన్స్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు ఇన్‌చార్జ్ డీఆర్వో అనురాధ తెలిపారు. గురువారం ఆమె తన కార్యాలయంలో పరీక్షల సమన్వయ సమావేశం నిర్వహించారు. జిల్లాలో కేవీ సుబ్బారెడ్డి కాలేజీలో పరీక్షా కేంద్రం ఉంటుందన్నారు.545 మంది అభ్యర్థులు ప్రిలిమ్స్ ద్వారా మెయిన్స్‌కు ఎంపికైనట్లు చెప్పారు.

- పాతవాహనాల వేలం పాటకు మంచి స్పందన వచ్చి టన్లు ఇన్‌చార్జ్ డీఆర్వో అనురాధ తెలిపారు. 9 వాహ నాలను వేలంలో ఉంచగా20 మంది హాజరైని బంధనల ప్రకారం పాటలో పాల్గొన్నట్లు ఆమె వివరించారు.

జాతీయ స్థాయి పోటీలకు విద్యార్థి ఎంపిక


విద్యార్థిని అభినందిస్తున్న ప్రిన్సిపాల్

కర్నూలు(రూరల్): ఈ నెల 6 నుంచి 12వ తేదీ వరకు స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఢిల్లీలో జరిగే జాతీయ స్థాయి హ్యాండ్ బాల్ అండర్ 19 పోటీలకు కర్నూలు ఒకేషనల్ జూనియర్ కళాశాల విద్యార్థి మారుతీ నాయక్ ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ ఎస్ నాగస్వామి తెలిపారు. గురువారం విద్యార్థిని ప్రిన్సిపాల్, అధ్యాపకలు అభినందించారు. జాతీయ స్థాయి పోటీల్లో మంచి ప్రతిభ కనపరిచి పతకంలో తిరిగిరావాలని వారు ఆక్షాంక్షించారు.

ఆటో డ్రైవర్ దుర్మరణం


మృతిచెందిన డ్రైవర్ ఏకాంతేశ్వర్

ఆలూరు: దేవనకొండ మండల కేంద్రం నుంచి జిల్లెడుబుడక గ్రామానికి ప్రయాణిస్తున్న ఆటో బోల్తా పడి డ్రైవర్ ఏకాంతేశ్వర్ (32) అక్కడికక్కడే మృతిచెందాడు. వివరాల్లోకి వెళ్తే జిల్లెడుబుడక గ్రామం నుంచి మిత్రుడు నరసింహ నాయుడును హైదరాబాద్ బస్సు ఎక్కించేందుకు మరొక మిత్రుడు వీరేష్ నాయుడుతో కలిసి అశోక్ లేలాండ్ గూడ్స్ ఆటో ఏపీ 39 బి 6415లో దేవనకొండకు బయలుదేరారు. వీరేష్ నాయుడు బస్సు ఎక్కిన తర్వాత జిల్లెడుబుడకలకు తిరుగు ప్రయాణంలో గద్దెరాళ్ల స్టేజ్ వద్ద అకస్మాత్తుగా కుక్క అడ్డం రావడంతో తప్పించబోయి కుడి వైపుకు తిప్పగా ఆటో బోల్తా పడింది. డ్రైవర్ ఏకాంతేశ్వర్ తలకు బలమైన గాయం తగలడంతో రక్తస్రావం జరిగి అక్కడికక్కడే మృతిచెందాడు.

లారీ ఢీకొని ఒకరికి గాయాలు

ఆస్పరి: ఆస్పరి సమీపంలో గురువారం స్కూటర్‌ను లారీ ఢీకొన్న ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలైనట్లు ఎస్ఐ వరప్రసాద్ తెలిపారు. మండలంలోని శంకరబండ గ్రామానికి చెందిన హనుమంతు పని నిమిత్తం ఆస్పరికి వచ్చారు. పని ముగించుకుని స్వగ్రామమైన శంకరబండకు స్కూటర్‌పై వెళ్తుండగా ఆదోని నుంచి ఆస్పరి వైపు వస్తున్న లారీ ఢీకొట్టడంతో తీవ్రంగా గాయపడ్డాడు. ప్రమాదంలో ఒక కాలు తెగిపడింది. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు స్థానికుల సహాయంతో ఆటోలో చికిత్స నిమిత్తం ఆదోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడినుంచి మెరుగైన చికిత్స నిమిత్తం కర్నూలుకు తీసుకెళ్లారు.

క్లుప్తంగా

సమస్యల పరిష్కారానికి కృషి


ట్యాంక్‌ను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ సుదర్శన్‌రెడ్డి

కల్లూరు: సమస్యల పరిష్కారానికి కృషిచేస్తామని 29వ వార్డు కార్పొరేటర్ సంగాల సుదర్శన్‌రెడ్డి తెలిపారు. గురువారం 29వ వార్డు పరిధిలోని పందిపాడులో ప్రజల దాహార్తిని తీర్చేందుకు ఏర్పాటు చేసిన నీటిట్యాంక్‌ను ప్రారంభించారు. కార్యక్రమంలో 26వ వార్డు కార్పొరేటర్ లక్ష్మీకాంతరెడ్డి, కల్లూరు సొసైటీ అధ్యక్షుడు శివశంకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కేసీ కాల్వకు నీటి విడుదల

గూడూరు: సుంకేసుల రిజర్వాయర్ నుంచి కేసీ కాల్వకు 180 క్యూసెక్కుల నీటిని విడుదల చేసినట్లు గురువారం డ్యాం అధికారులు తెలిపారు. కర్నూలు నగర ప్రజల తాగునీటి అవసరాల కోసం ఈ నీటిని విడుదల చేసినట్లు వారు తెలిపారు. డ్యాంలో 1.110 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు.

రీసర్వేలో పొరపాట్లకు తావివ్వొద్దు


భూ రీసర్వేపై సూచనలిస్తున్న తహసీల్దార్ శివశంకర్‌నాయక్

సి.బెళగల్: ఎలాంటి పొరపాట్లకు తావివ్వకుండా భూముల రీ సర్వేలో పకడ్బందీగా చేపట్టాలని తహసీల్దార్ శివశంకర్‌నాయక్ రెవెన్యూ సిబ్బందికి సూచించారు. గురువారం మండల పరిధిలోని పలుకుదొడ్డి గ్రామ పంచాయతీ కార్యాలయంలో భూముల రీ సర్వేపై ప్రజలు, రైతులతో సమావేశమై అవగాహన కల్పించారు. రీ సర్వే చేయించుకుంటే భూ సమస్యలు తొలగిపోతాయని రైతులకు సూచించారు. సర్వే సమాచారాన్ని ముందే రైతులకు తెలపాలని సిబ్బందికి సూచించారు. సమావేశంలో డీటీ సరళ, వీఆర్వో శ్రీనివాసులు పాల్గొన్నారు.

రజకులను ఎస్సీ జాబితాలో చేర్చాలి


మాట్లాడుతున్న రజక సంఘం నాయకులు

పాణ్యం: రజకులు ఆర్థిక, సామాజిక రంగాల్లో అభివృద్ధి చెందాలంటే ఎస్సీ జాబితాలో చేర్చాలని రజక సంఘం మండల అధ్యక్షుడు తిరుపాలు డిమాండ్ చేశారు. గురువారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గ్రామంలో వంద మంది రజక కుటుంబాలు కులవృత్తిని నమ్ముకుని జీవనం సాగిస్తున్నాయన్నారు. వారందరికీ ధోబీఘాట్లు నిర్మించడంతో పాటు రజక వృత్తిదారుల సమావేశ మందిరం నిర్మించాలన్నారు. సమావేశంలో రజకసంఘం సభ్యులు మద్దిలేటి, చిన్న మద్దిలేటి, బుడ్డన్న, నాగరాజు, ఎల్లసుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

నగరపాలక కార్యదర్శి బదిలీ

కర్నూలు (టౌన్): సాధారణ బదిలీల్లో భాగంగా నగరపాలక సంస్థ కార్యదర్శి ఎస్ఎన్ లావణ్య బదిలీ అయ్యారు. ఆమెను గుంతకల్లు కమిషనర్‌గా బదిలీ చేస్తూ జీఓ 344ను ప్రభుత్వం జారీ చేసింది. అక్కడ గ్రేడ్-3గా పనిచేస్తున్న షేక్ మాలిక్‌ను నగరపాలక సంస్థ అసిస్టెంట్ కమిషనర్‌గా బదిలీ చేస్తూ గురువారం ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి శ్రీలక్ష్మి ఉత్తర్వులు జారీ చేశారు.

అటవీశాఖలో..

కర్నూలు కల్చరల్: అటవీశాఖలో పలువురు ఉద్యోగులకు స్థాన చలనం కలిగింది. ఫారెస్టర్ -1, ఫారెస్ట్ బీట్ ఆఫీసర్లు -5, అసిస్టెంట్ బీట్ ఆఫీసర్లు- 3, విలేజ్ ఫారెస్ట్ వర్కర్స్ -2 బదిలీ చేసినట్లు జిల్లా అటవీశాఖ అధికారి పి.శివశంకర్‌రెడ్డి పేర్కొన్నారు.

విద్యుత్ లైన్‌మెన్లు..

కర్నూలు(రాజ్‌విహార్): విద్యుత్ లైన్‌మెన్లకు స్థాన చలనం కలిగింది. సాధారణ బదిలీల్లో భాగంగా నిబంధనల మేరకు పలువురు లైన్ మెన్లు, అసిస్టెంట్ లైన్‌మెన్లకు బదిలీ చేస్తూ కర్నూలు టౌన్ ఆపరేషన్స్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీరు రమేష్ ఉత్తర్వులు జారీ చేశారు.

4న షుగర్‌పై అవగాహన సదస్సు

కర్నూలు(హాస్పిటల్): షుగర్ జబ్బుపై ఈనెల 4న అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు కర్నూలు హార్ట్ ఫౌండేషన్ కార్యదర్శి డాక్టర్ పి.చంద్రశేఖర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సాయంత్రం 6 గంటలకు స్థానిక హెల్త్‌క్లబ్‌లో సదస్సు ప్రారంభమవుతుందని, షుగర్ జబ్బు లక్షణాలు, కారణాలు, చికిత్స గురించి ఎండోక్రైనాలజిస్టు డాక్టర్ భరత్ వివరిస్తారన్నారు.

9న సిల్వర్ జూబ్లీ కళాశాల ప్రవేశ పరీక్ష

కర్నూలు కల్చరల్: కర్నూలుసిల్వర్ జూబ్లీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రవేశాలకు ఈనెల 9న సిల్వర్ సెట్ - 2023 నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వీవీ సుబ్రహ్మణ్యకుమార్ తెలిపారు. పరీక్ష హాల్ టికెట్స్‌ను శుక్రవారం నుంచి కళాశాల వెబ్‌సైట్ sjgckurnool.edu.in ద్వారా డౌన్‌లోడ్ చేసుకోవచ్చని సూచించారు.

మహిళల కోసం జాబ్ మేళా


వాల్‌పోస్టర్‌ను విడుదల చేస్తున్న దృశ్యం

కర్నూలు(రాజ్‌విహార్): మహిళల కోసం ప్రత్యేకంగా జాబ్ మేళా నిర్వహించనున్నట్లు మాజీ ఎంపీ, వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు బుట్టా రేణుక తెలిపారు. గురువారం ఆమె తన కార్యాలయంలో ఉద్యోగ అవకాశాల వాల్ పోస్టర్లు విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తిరుపతి సమీపంలోని శ్రీసిటీలో ఉన్న స్మార్ట్ మొబైల్ కంపెనీలో ప్రొడక్షన్ ఆపరేటర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయని, ఇవి కేవలం మహిళల కోసమే అన్నారు. ఆసక్తి ఉన్న అభ్యర్థినులు 8332918999 నంబరుకు సంప్రదించాలని సూచించారు.

ఆర్‌యూలో ఏడుగురి సస్పెన్షన్

కర్నూలు (న్యూసిటీ): రాయలసీమ విశ్వవిద్యాలయంలోని ఏడుగురి బోధనేతర సిబ్బందిపై సస్పెన్షన్ వేటు పడింది. కొందరు విద్యార్హత, పుట్టిన తేదీ నకిలీ ధ్రువప్రతాలు సమర్పించి ఉద్యోగాలు పొందినట్లు యూనివర్సిటీ దృష్టికి వచ్చింది. వారి ఒరిజినల్ సర్టిఫికెట్లను ధ్రువీకరించడానికి విశ్వవిద్యాలయం నిజనిర్ధారణ కమిటీని ఏర్పాటు చేసింది. సర్టిఫికెట్ల వాస్తవికతకు సంబంధించి అధికారుల నుంచి వచ్చిన లేఖలను ధ్రువీకరించిన తర్వాత కమిటీ ఆరోపణల నివేదికను ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ సమావేశం ముందు సమర్పించింది. కమిటీ నివేదికను ఆమోదించిన ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ ఏడుగురు ఉద్యోగులను సస్పెండ్ చేసినట్లు గురువారం విశ్వవిద్యాలయం అధికార యంత్రాంగం తెలిపింది.

భక్తిశ్రద్ధలతో ధ్వజస్తంభ ప్రతిష్ట


ధ్వజస్తంభాన్ని ప్రతిష్టిస్తున్న దృశ్యం


శిలాఫలకాన్ని ప్రారంభిస్తున్న మార్కెట్ యార్డు చైర్మన్ ప్రభాకర్‌రెడ్డి

ఓర్వకల్లు: మండలంలోని కాల్వ గ్రామంలో గురువారం ధ్వజస్తంభ ప్రతిష్ట కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. కర్నూలు మార్కెట్ యార్డు చైర్మన్ ప్రభాకర్‌రెడ్డి, సర్పంచు కేవీ వెంకటేశ్వర్లు, ఎంపీపీ తిప్పన్న, జెడ్పీటీసీ సభ్యులు రంగనాథ్‌గౌడు, హుసేనాపురం సింగిల్ విండో చైర్మన్ నాగతిరుపాలు, కాల్వబుగ్గ ట్రస్టుబోర్డు చైర్మన్ గుర్రాల చెన్నారెడ్డి, ఎంపీటీసీ సభ్యులు నాగిరెడ్డి తదితరులు బుగ్గరామేశ్వరస్వామిని దర్శించుకున్నారు. అనంతరం శిలాఫలకాన్ని ప్రారంభించారు. ఆ తర్వాత కాల్వబుగ్గ దేవస్థాన ప్రధాన అర్చకులు కళ్లె లక్ష్మీనారాయణశర్మ, లక్ష్మీనరసింహాశర్మ ఆధ్వర్యంలో పురోహితులు వేదమంత్రోచ్చరణలతో యంత్ర ప్రతిష్ట, ధ్వజప్రతిష్ట, పూర్ణాహుతి, తీర్థప్రసాద వితరణ చేశారు. భక్తులకు అన్నదానం చేశారు.

ఆరోగ్యాన్ని కాపాడుకోవాలి


ఉల్చాల హరిప్రసాద్‌రెడ్డికి కంటి పరీక్ష చేస్తున్న డాక్టర్ ఆదిమూలపు సతీష్

కర్నూలు(హాస్పిటల్): ప్రతి ఒక్కరూ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఇన్‌ఫర్మేషన్ కమిషనర్ ఉల్చాల హరిప్రసాద్‌రెడ్డి సూచించారు. జిల్లా వినియోగదారుల వివాదాల పరిష్కార కమిషన్, మైపర్ డైరెక్టర్, కంటి వైద్యనిపుణులు డాక్టర్ ఆదిమూలపు సతీష్ సంయుక్త ఆధ్వర్యంలో గురువారం మున్సిఫ్ కోర్టు ఆవరణలో ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా హరిప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఏడాదికి ఒకసారైనా హెల్త్ చెకప్ చేయించుకోవాలన్నారు. పరీక్షల అనంతరం వైద్యులను కలిసి వారి సలహా మేరకు ఆహారపు అలవాట్లు మార్చుకోవాలని సూచించారు. శిబిరానికి వచ్చిన వారికి డాక్టర్ ఆదిమూలపు సతీష్‌తో పలువురు వైద్యులు వైద్యం చేసి, పలు సూచనలు ఇచ్చారు. కార్యక్రమంలో కోర్టు జడ్జి కిశోర్‌కుమార్, సభ్యులు నారాయణరెడ్డి, నజీమ కౌసర్, సూపరింటెండెంట్ రాముడు, లక్ష్మీకాంతరెడ్డి, రవీంద్రనాథ్‌రెడ్డి పాల్గొన్నారు.

ఠంచన్‌గా పింఛన్

- ఇంటింటికి వెళ్లి పింఛన్ సొమ్ము అందజేసిన వలంటీర్లు


కల్లూరు మండలం తడకనపల్లెలో మానసిక వికలాంగురాలు షమీన్‌కు ఐరిస్ తీసుకుంటున్న వలంటీర్ మహబూబ్ బాషా

కోడుమూరు రూరల్: వైఎస్సార్ పెన్షన్ కానుక లబ్దిదారులకు ఠంచన్‌గా పింఛన్ సొమ్ము అందింది. నెల మొదటి రోజు గురువారం తెల్లవారుజాము నుంచే వలంటీర్లు పింఛన్‌దారుల ఇళ్లకు వెళ్లి వేలిముద్రలు తీసుకుని పింఛన్ సొమ్ము అందజేశారు. వేలిముద్రలు పడని వృద్ధులు, దివ్యాంగులకు ఫేష్ యాప్ ద్వారా ఐరిష్ తీసుకుని పింఛన్ సొమ్మును అందజేశారు. మండలంలో 8,805 లబ్ధిదారులు ఉండగా సాయంత్రానికి 6,883 మందికి పింఛన్ సొమ్మును అందజేసినట్లు ఎంపీడీఓ చంద్రశేఖర్ తెలిపారు. ఈలెక్కన 80 శాతం పూర్తయిందని మిగతా 20 శాతం ఒకటి రెండు రోజుల్లో పూర్తి చేస్తామని ఆయన తెలిపారు.

గూడూరులో 79.85 శాతం..

గూడూరు: పట్టణంలో వైఎస్సార్ పింఛన్ కానుకను గురువారం ఉదయాన్నే వలంటీర్లు లబ్ధిదారులకు అందించారు. 2,218 మంది లబ్ధిదారులు ఉండగా 1,771 మందికి అందించడంతో 79.85 శాతం పూర్తయిందని మున్సిపల్ కమిషనర్ ప్రసాద్ గౌడ్ తెలిపారు.

కల్లూరులో 71 శాతం..

కల్లూరు: నెల మొదటి రోజు కావడంతో వైఎస్సార్ పింఛన్ కానుకను వలంటీర్లు ఉదయం నుంచి ఇంటింటికీ వెళ్లి వృద్ధులకు, ఒంటరి మహిళలకు, దివ్యాంగులకు పంపిణీ చేశారు. మండలంలో 8,174 మంది పింఛన్ దారులు ఉండగా సాయంత్రంలోపు 5,793 మందికి పంపిణీ చేసినట్లు అధికారులు తెలిపారు.

పాణ్యంలో 59.34 శాతం

పాణ్యం: వలంటీర్లు గురువారం ఉదయమే పింఛన్ కానుక పంపిణీని ప్రారంభించారు. మొదటి రోజు 59.34 శాతం పూర్తి చేశారు. మండలంలో ఉన్న 6,237 మంది పింఛన్‌దారులకు గానూ 3,704 మందికి పింఛన్‌ను పంపిణీ చేశారు.

గడివేములలో 66 శాతం..

గడివేముల: వైఎస్సార్ పింఛన్ కానుకను గురువారం తెల్లవారుజాము నుంచే వలంటీర్లు ఇంటివద్దకు వెళ్లి లబ్ధిదారులకు అందించారు. మండల వ్యాప్తంగా 5,625 మంది పింఛన్‌దారులు ఉండగా మొదటి రోజే 3,716 మందికి అందించారు. దీంతో 66 శాతం పంపిణీ పూర్తయిందని ఎంపీడీఓ శివ మల్లేశ్వరప్ప తెలిపారు.


గడివేముల మండలం చిందుకూరులో రామసుబ్బారెడ్డికి పింఛన్ సొమ్మును అందిస్తున్న వలంటీరు నాగేశ్వరరావు

వైస్‌చైర్మన్ బాధ్యతల స్వీకరణ

కర్నూలు (టౌన్): కర్నూలు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ వైస్ చైర్మన్‌గా ఎస్.ప్రతాప్ సూర్య నారాయణ రెడ్డి గురువారం బాధ్యతలు చేపట్టారు. సాంఘిక సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్‌గా పనిచేస్తున్న ఆయనను ప్రభుత్వం వైస్ చైర్మన్‌గా నియమించింది. బాధ్యతలు చేపట్టిన ఆయనను కుడా ప్లానింగ్ ఆఫీసర్ విజయభాస్కర్, జూనియర్ ప్లానింగ్ ఆఫీస ర్ రాజేష్, సిబ్బంది అభినందనలు తెలియజేశారు.